**కథానిక**

మల్లాది వెంకటకృష్ణమూర్తి

# ఛాందసుడు

శిఖామణికి పద్దెనిమిదేళ్ళుంటాయి. తూర్పు గోదావరి జిల్లాలోని ఓ పల్లెటూరి నుంచి వచ్చాడు ఆ పెళ్ళికి. ఇంటర్ పోవడంతో చదువు ఆగిపోయింది.

వాణిశ్రీకి పదిహేడేళ్ళు. అదే పెళ్ళికి హైద్రాబాద్ నుంచి వచ్చింది. తల్లి లేదు కాబట్టి అత్తయ్య దగ్గర గారాబంగా పెరుగుతోంది. లక్షణంగా మూడు పూటలా గాయిత్రీ జపం, సంధ్యా వందనం చేస్తున్న శిఖామణిని చూసి వాణిశ్రీ అత్తయ్య ముచ్చటపడింది.

ఆ కుర్రాడి కళ్ళు, ఆ అమ్మాయి కళ్ళు కలుసుకున్నాయి చాలాసార్లు. వాణిశ్రీ ధైర్యం చేయటం వల్ల ఇద్దరి చేతులు కలుసుకున్నాయి. చూడటానికి సీతలా కనిపించే వాణిశ్రీలో 'ద్రౌపది' కూడా ఉంది. అందుకే ధైర్యంగా శిఖామణి చెవిలోఅన్నది మెల్లగా.

"సాయింత్రం చీకటిపడేవేళకి గుడి వీధిలోని మా చినమామయ్య ఇంటికి రా అప్పుడక్కడ ఎవ్వరు వుండరు".

ఎందుకనో అనుకొన్నాడు ముందర. ఎందుకో తట్టగానే అదిరి పడ్డాడు. ఆ అమ్మాయి సాహసానికి అచ్చెరువొందాడు. వాణిశ్రీ అందం తలచుకొని ఆనంద పడ్డాడు. ఆ అందంలోని మకరందాన్ని అందుకో వచ్చుననుకోగానే ఆ క్షణాల కోసం ఆత్రంగా చూడసాగారు.

వాణిశ్రీ చిన్న మాయచేసి చిన్న మామయ్య ఇంటి తాళంచెవి తీసుకొని గప్‌చిప్‌గా సాయంత్రం గుడిలోని ఆ యింటికి చేరుకొని శిఖామణి కోసం ఎదురు చూడసాగింది.

అరగంట గడిచింది. గంట గడిచింది. రెండుగంటలు గడిచాయి. శిఖామణి పత్తాలేడు. ఇంతలో మేనమామే వచ్చాడు. శిఖామణిని మనస్సులోనే శపిస్తూ పెళ్ళి ఇంటికి వెళ్ళింది వాణిశ్రీ.

శిఖామణిని వెదికి పట్టుకొంది.

"వస్తానని నమ్మించి, మోసంచేసి, చివరికి ఇదా నీవు చేసేది?" అంటూ మెత్తగా తిట్టింది.

ముక్కు గీక్కొని తల వంచుకొని చెప్పాడు శిఖామణి.

"మీ అత్తయ్య గోత్రం అడిగింది. రాబోయే ముందు మనిద్దరం సగోత్రీకులం అని తెలిసింది. గోత్రం కలిస్తే మనం అలాంటి తప్పులు చేయచ్చా? మనకిక పుట్టగతు లుంటాయా?"

ఏడవ లేక నవ్వింది వాణిశ్రీ

# దారిద్ర్యం . . . . . . . . . రాజీవి

క్రింటి చూపు లేదు కడుపుకన్నము లేదు
ఒంటినిండా మట్టి ఊదుపొట్ట.
అంటరాని తనము ఆ మహాశయునికే
కంటనీరు పెట్టు కరుణలేదో?
కన్ను కాననట్టి కటికి చీకటిలోన
మిన్ను పై బడనున్న మేఘ గర్జనలలో
అన్నమో రామయ్య అనుచు
అరిచాడొకడు
విన్నవారే సున్న విలయ ప్రపంచాన?
మూడునాళ్ళ నుండి ముద్దకైనా లేక
మూడునాళ్ళు కూడ ముడతవడియె?
ఏడనుంటివి సామి? ఎందుకుంటివి
రోయి?
చూడనైనా లేని చూపుమాంద్యము తోడ